TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 114 | మంగళవారం, ఆగస్టు 27, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

### రైతుల ఉద్యమంపై కంగనా వ్యాఖ్యలకు...

## మద్దతు ఇవ్వని బిజెపి

న్యూ ఢిల్లీ: రైతుల ఆందోళన గురించి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలకు భారతీయ జనతా పార్టీ (బిజెపి) సోమవారం దూరంగా ఉంది, భవిష్యత్తులో అలాంటి ప్రకటనలు చేయవద్దని మండి సిట్టింగ్ ఎంపీ అయిన కంగనా రనౌత్ ని కోరింది. రైతుల ఆందోళనపై రనౌత్ చేసిన వ్యాఖ్యలతో విభేదిస్తూ, రాజకీయ నాయకురాలిగా మారిన నటికి విధానపరమైన అంశాలపై మాట్లాడే అధికారం లేదని కాషాయ పార్టీ పేర్కొంది. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్'తో సామాజిక సామరస్య సూత్రాలను పార్టీ విశ్వసిస్తోందని, వాటిని అనుసరించాలని నిర్ణయించుకున్నామని బిజెపి తెలిపింది. ఆమె వ్యాఖ్యలకు కాంగ్రెస్ నుండి కూడా ప్రతిస్పందన వచ్చింది, నాయకుడు రణదీప్ సూర్జేవాలా బిజెపి నాయకుడిని "త్వరగా కోలుకోవాలని" కోరారు. హర్యానాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సుర్జేవాలాల్, "ఇవి కేవలం కంగనా మాటలేనా లేక మరెవరో కాపీ చేశారా? కాకపోతే, ఈ విషయంలో బిజెపి ఎందుకు మౌనంగా ఉంది?" రెచ్చగొట్టే వ్యాఖ్యలకు పేరుగాంచిన శ్రీమతి రనౌత్, ఇప్పుడు రద్దు చేయబడిన




మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతుల నిరసనను తీవ్రంగా విమర్శించారు. ఆ మహిళ "రూ. 100కి అందుబాటులో ఉంది" అని కూడా చెప్పింది, నిరసనల కోసం ఆమెను తీసుకోవచ్చని సూచించింది. ఈ ఏడాది జూన్‌లో ఢిల్లీకి వెళుతున్న సమయంలో చండీగఢ్ విమానాశ్రయంలో మహిళా సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ కానిస్టేబుల్‌తో శ్రీమతి రనౌత్ చెంపదెబ్బ కొట్టడంతో ఈ ప్రకటన పెద్ద దుమారాన్ని రేపింది.

### కావాలంటే.. నాపై మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి...

## హైడ్రా కూల్చివేతలపై ఓవైసీ

హైదరాబాద్: హైదరాబాద్‌లో అక్రమకట్టడాలను హైడ్రా కూల్చివేస్తుండటంతో.. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తమ కట్టడాలను కూడా కూల్చివేస్తారా? అని భయపడుతున్నారు. హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్ తోపాటు పలువురి అక్రమకట్టడాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. దీంతో సోషల్ మీడియాలో హైడ్రా కూల్చివేతలపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. చెరువులను కబ్జా పెట్టి నిర్మించారంటూ పలువురు.. అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. ఇందులో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసికి చెందిన బిల్డింగ్ లు కూడా ఉన్నాయి. బండ్లగూడలోని ఫాతిమా ఒవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందని వార్తలు వస్తుండటంతో ఆయన స్పందించారు. 'పేదలకు ఉచిత విద్యనందించేందుకు 12 బిల్డింగ్‌లు నిర్మించా. కొందరు వీటిపై వక్రదృష్టి పెట్టారు. గతంలో నాపై కాల్పులు జరిగాయి. కావాలంటే మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి. కత్తులతో దాడి చేయండి. కానీ పేదల విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడకండి' అని అక్బరుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు.




### నేడు కవిత బెయిల్

## వినతిపై విచారణ

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసులో బిఆర్ఎస్ నాయకురాలు కె. కవిత బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం విచారించనుంది. న్యాయమూర్తులు బిఆర్. గవాయ్, కెవి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టనుంది. ఈ రెండు కేసుల్లో ఆమెకు బెయిల్‌ను నిరాకరిస్తూ జూలై 1న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ కవిత దాఖలు చేసిన పిటిషన్లపై ఆగస్టు 12న సుప్రీంకోర్టు సిబిఐ, ఈడిల నుంచి స్పందన కోరింది. ఇప్పుడు రద్దయిన ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ 2021-22 రూపకల్పన,అమలుకు సంబంధించిన నేరపూరిత కుట్రలో ప్రధాన కుట్రదారుల్లో ఆమె ప్రాథమికంగా ఒకరని పేర్కొంటూ, రెండు కేసుల్లోనూ కవిత బెయిల్ పిటిషన్‌లను హైకోర్టు ఇదివరలో కొట్టివేసింది. పాలసీ రూపకల్పన, అమలులో అవినీతి, మనీలాండరింగ్‌కు సంబంధించి సిబిఐ, ఈడి వేర్వేరుగా కేసులు నమోదు చేశాయి. మార్చి 15న హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ లోని ఆమె నివాసం నుంచి కవిత(46)ని అరెస్ట్ చేసింది ఈడి.



### అమిత్ షా కీలక ప్రకటన..

## లద్ధాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు!

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. లడఖ్‌లో ఐదు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోడీ విజన్ ప్రకారం లద్ధాఖ్ అభివృద్ధి, శ్రేయస్సును కాంక్షిస్తూ ఐదు కొత్త జిల్లాలు ఏర్పాటు నిర్ణయం తీసుకున్నామని అమిత్ షా చెప్పారు. లద్ధాఖ్‌లో జన్స్కర్, ద్రాస్, షామ్, నుబ్రా, చాంగ్‌థాంగ్ జిల్లాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఫలాలు అందుతాయని షా చెప్పారు.



### త్వరలో 35 వేల ఉద్యోగాలు...

## భర్తీ చేస్తాం




హైదరాబాద్: నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 90 రోజుల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు. మరో 35 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నట్లు చెప్పారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు రేవంత్ చెక్కులు అందజేశారు. ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణత సాధించిన 135 మంది అభ్యర్థులకు ఒక్కొక్కరికీ రూ. లక్ష చొప్పున అందజేశారు.

ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి అత్యధికంగా సివిల్ సర్వెంట్లు రావాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. సివిల్స్ ఉత్తీర్ణులై రాష్ట్ర ప్రతిష్ఠను పెంచాలని ఆకాంక్షించారు. మెయిన్స్లో ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి కూడా రూ.1 లక్ష ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. "చదువుకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో చాలా మంది ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో యంగ్ ఇండియా వర్సిటీ ద్వారా 2వేల మందికి శిక్షణ ఇస్తున్నాం. వచ్చే ఏడాది నుంచి 20 వేల మందికి శిక్షణ ఇస్తాం. అంతేకాకుండా యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తాం. 2028 ఒలింపిక్స్లో తెలంగాణ అథ్లెట్లకు అత్యధికంగా పతకాలు వచ్చేలా కృషి చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో 25 నుంచి 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం వర్సిటీలను నిర్వీర్యం చేసింది. 10, 15 రోజుల్లో అన్ని వర్సిటీలకు నూతన వైస్ ఛాన్సలర్లను నియమిస్తాం. వర్సిటీల్లోని అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం. కొందరు ఉద్దేశపూర్వకంగా నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారు. తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు." అని రేవంత్ అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో అభ్యర్థులకు ఇలా సాయం చేయడం మొదటిసారి అన్నారు. అభ్యర్థులకు ఎంతోకొంత సాయం చేయాలన్న ఉద్దేశంతో చెక్కుల పంపిణీ చేస్తున్నామంటూ డిప్యూటీ సీఎం చెప్పారు. ఇది రాష్ట్రానికి ఉపయోగపడుతుందని ఆశిస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరాం తదితరులు పాల్గొన్నారు.

### ప్రధాని మోదీ, తెలుగు రాష్ట్రాల సీఎంల

## జన్మాష్టమి శుభాకాంక్షలు


హైదరాబాద్: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ, తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. 'దేశ ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు. జై శ్రీకృష్ణా' అని ప్రధాని మోదీ హిందీలో ట్వీట్ చేశారు. అలాగే శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు అంటూ ఏపీ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. "ఆ శ్రీకృష్ణ



భగవానుడు మీ కుటుంబాన్ని ఆనందంతో, ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో ఆశీర్వదించాలని మనసారా కోరుకుంటున్నాను. గీతాసారంతో జీవితసారం చెప్పిన శ్రీకృష్ణ పరమాత్ముడిని స్మరించుకోవడం అంటే మన కర్తవ్యాన్ని మనం గుర్తుచేసుకుని ముందుకు సాగడమే. ఏ విషయంలో అయినా మనకు స్ఫూర్తినిచ్చే శ్రీ కృష్ణ తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి అంశంలో మనం విజయం సాధించవచ్చు.

## "బాటేంగే తో కటేంగే"

### ఐక్యంగా ఉంటే బాగుంటారు : యోగి ఆదిత్య నాథ్



ఆగ్రా: బంగ్లాదేశ్ లో తాజాగా హింసాత్మక ఘటనలు చెలరేగడంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. " జాతిని మించినది ఏది లేదు. ఐక్యంగా ఉన్న జాతే సాధికారతను సాధిస్తుంది. విభజించబడితే కోసేస్తారు. బంగ్లాదేశ్ లో ఏమి జరుగుతోందో మీరు చూస్తున్నారు. అలాంటి తప్పు ఇక్కడ జరగకుండా చూడాలి. బటేంగే తో కటేంగే, ఏక్ రహేంగే తో నేక్ రహేంగే' అన్నారు. ఆగ్రాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ పై విధంగా చెప్పారు. బంగ్లాదేశ్ లో హింసాత్మక ఘటనలపై యూపి ముఖ్యమంత్రి మాట్లాడారు.

ఆగస్టు 5న షేక్ హసీనా దేశం వదిలి పారిపోయాక అక్కడ రాజకీయ సంక్షోభం ఏర్పడిందన్నారు. బంగ్లాదేశ్ లో నేడు హిందూ జనాభా కేవలం 8 శాతమే. దాంతో హిందువుల మీద దాడులు, హిందువుల మందిరాల కూల్చివేతలు, ఆస్తుల విధ్వంసాలు కొనసాగుతున్నాయన్నారు. షేక్ హసీనా దేశం వదిలిపెట్టాక ఇప్పటి వరకు బంగ్లాదేశ్ లో 200 దాడులు జరిగాయన్నారు

# అభిషేక్ బెనర్జీ మైనర్ కుమార్తెకు రేప్ బెదిరింపు



**కోల్‌కతా:** ఆర్‌జి కార్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో ఒక పిజి ట్రెయినీ డాక్టర్ హత్యాచార ఘటనపై నిరసన తెలియచేస్తూ జరిగిన ఒక ర్యాలీలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్(టిఎంసి) జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి అభిషేక్ బెనర్జీ మైనర్ కుమార్తెకు వ్యతిరేకంగా వచ్చిన బెదిరింపులను పశ్చిమ పిల్లల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగా పరిగణిస్తోంది. ఇందుకు సంబంధించి సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోను కమిషన్ సుమోటోగా పరిగణనలోకి తీసుకుంది. నిరసన సందర్భంగా అభిషేక్ బెనర్జీ 11 ఏళ్ల కుమార్తెపై అతాచారానికి పాల్పడాలని, ఆ పని చేసిన వారికి రూ 10 కోట్లు బహుమానంగా ఇస్తానంటూ ఒక వ్యక్తి ఆ వీడియోలో చెప్పడాన్ని కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఒక మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడాలంటూ బహిరంగంగా ఒక వ్యక్తి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు ఆ వ్యక్తి నీచ మనస్తత్వాన్ని బయటపెడుతోందని, ఇది బాలికల రక్షణకు, భద్రతకు ముప్పు కలిగించేదని కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. పోక్సో, జువెనైల్ జస్టిస్ యాక్ట్, ఐయాలికల హక్కులపై ఐక్య రాజ్య సమితికి నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కమిషన్ పోలీసులను ఆదేశించింది. తీసుకున్న చర్యలపై రెండు రోజులలో తమకు నివేదిక సమర్పించాలని కూడా పోలీసులను కమిషన్ ఆదేశించింది.

# నేషనల్ స్పోర్ట్ డే పోస్టర్, టీ షర్ట్స్ అవిష్కరణ



**హైదరాబాద్ :** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు సంబందించి పోస్టర్ , టీ షర్ట్స్ ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నేడు ఎల్బీ స్టేడియంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సలహాదారుడు మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి , ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్ ,ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు రోహిన్ రెడ్డి ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ నెల 29 న ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా స్పోర్ట్స్ డే లో భాగంగా పోస్టర్, లోగోఆవిష్కరించామన్నారు. ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి ఆలోచన అని తెలిపారు. ఇటీవల కొరియా దేశం వెళ్ళినప్పుడు అక్కడ క్రీడా సంస్థలు క్రీడాకారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసిన తరువాత, తెలంగాణ లో కూడా స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ప్రకటించారని గుర్తు చేశారు. 29 నాడు గచ్చిబౌలి స్టేడియంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాల వేస్తారని తెలిపారు. అన్ని జిల్లాల్లో క్రీడా దినోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని., ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేసిన తల్లిదండ్రుల స్పందన ముఖ్యం పిల్లలను ప్రోత్సహించాలని తెలిపారు.. శివసేన రెడ్డి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అయ్యారని.. స్పోర్ట్స్ కోసం పెద్ద ఎత్తున నిధుల కేటాయింపు జరుగుతుందని.. కరీంనగర్ లో కూడా స్పోర్ట్స్ స్కూల్ ఉందని., స్పోర్ట్స్ కార్యక్రమానికి తెలంగాణ సమాజం మద్దతు ఇవ్వాలని పిలుపు ఇచ్చారు.

# బలూచిస్థాన్ లో నరమేథం... 33 మంది కాల్చివేత

**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్ లో దారుణం చోటుచేసుకుంది. కొందరు సాయుధులు రహదారిని అడ్డగించి, వాహనాల నుంచి ప్రయాణికుల్ని కిందికి దింపేసి కాల్పులు జరిపారు. బలూచిస్థాన్ లోని ముసాఖెల్ జిల్లాలో సోమవారం జరిగిన ఘటనలో 33 మంది ప్రాణాలు కోల్పోయారని డాన్ మీడియా సంస్థ వెల్లడించింది . మరో 21 మందికి బుల్లెట్ ల గాయాలయ్యాయి. ముసాఖెల్ జిల్లాలోని రరాషమ్‌లోని రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది.



కొందరు సాయుధులు దారిని అడ్డగించి, అటుగా వస్తోన్న బస్సులు, ట్రక్కుల్లో నుంచి ప్రయాణికుల్ని దింపి, వారి గుర్తింపు తనిఖీ చేశారు. తర్వాత వారిపై కాల్పులు జరపడంతో 23 మంది మృతి చెందారు. అంతేగాకుండా వాహనాలకు నిప్పుపెట్టారు. పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన ప్రయాణికులే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు మీడియా పేర్కొంది. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

# ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చునేందుకే హైడ్రా డ్రామా: ఎంపీ డీకే అరుణ

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే, తమ వైఫల్యాల నుండి ప్రజలను పక్కదారి పట్టించేందుకు హైడ్రాకు తెరలేపారని పాలమూరు పార్లమెంటు సభ్యులు డీకే అరుణ అన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన నిర్మాణాలకు అధికారులు అనుమతి ఇచ్చారని, అప్పుడు సక్రమమైనవన్నీ ఇప్పుడు అక్రమం ఎలా అవుతాయో ముఖ్యమంత్రి వెల్లడించాలన్నారు. ఇవాళ నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలో బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేసీఆర్ జైల్లో వేయడం బాధాకరమని, ఆ కక్ష్య ఉంటే కేసీఆర్ పైన, కేటీఆర్ పైన, వారి కుటుంబంపైన చూపించాలి తప్పు... ఇతరులపై చూపించడం తగదన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 6 గ్యారెంటీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని, అందుకే ప్రజల దృష్టి మళ్లించేందుకు హైదరాబాద్ హైడ్రా డ్రామాలాడుతున్నారని డీకే అరుణ ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాలనపై దృష్టి సారించాలని ఆమె ముఖ్యమంత్రికి సూచించారు. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టుల కింద పునరావాసం కల్పించాల్సిన గ్రామాల సమస్యలపై ముఖ్యమంత్రి రివ్యూ నిర్వహించి రోజులు



గడుస్తున్నప్పటికీ అతీగతీ లేదన్నారు. వెంటనే పునరావాస సమస్యలు పరిష్కరించాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాసులు, నాయకులు కర్ని స్వామి, జి.ప్రసన్న బలరాం రెడ్డి, బాల్చేడ్ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ లెస్ కారు అద్భుతం :మంత్రి శ్రీధర్ బాబు



సంగారెడ్డి : హైదరాబాద్ ఐఐటీ క్యాంపస్ లో విద్యార్థులు తాయారు చేసిన డ్రైవర్ లెస్ వెహికిల్ లో ప్రయాణించారు మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఐఐటీ డైరెక్టర్ మూర్తి. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఐఐటీ విద్యార్థులు రూపొందించిన డ్రైవర్ లెస్ కారు అద్భుతంగా ఉ ందన్నారు. సిలికాన్ వ్యాలీలో నేను, సీఎం రేవంత్ రెడ్డి డ్రైవర్ లెస్ వెహికిల్ లో ప్రయాణం చేశామన్నారు. అక్కడికంటే అద్భుతమైన అనుభూతి ఇప్పుడు ఇక్కడ ప్రయాణం చేస్తుంటే కలిగిందని మంత్రి అన్నారు. మన తెలంగాణలో ఉన్న ఐఐటీ హైదరాబాద్ రూపొందించిన ఈ టెక్నాలజీ మొత్తం మన దేశానికే గర్వ కారణం అవుతుందన్నారు. అయితే ప్రస్తుతానికి ప్రయోగ దశలో ఉన్న ఈ టెక్నాలజీ త్వరలోనే ఆచరణలోకి రావాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. అలాగే ప్రస్తుతం ప్రపంచంలో ఊపు మీద ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవలను కూడా త్వరలోనే అన్ని రంగాల్లో ఉపయోగించుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# ఛత్తీస్‌గఢ్ 25 మంది నక్సలైట్లు లొంగుబాటు



**బిజాపూర్:** ఛత్తీస్‌గఢ్ లోని బిజాపూర్ జిల్లాలో 25 మంది నక్సలైట్లు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ఐదుగురి తలలపై మొత్తంగా రూ. 28లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు)కు చెందిన వీరంతా గంగ్లూర్, భైరామ్‌గఢ్ ఏరియా కమిటీల్లో క్రియాశీలకంగా పనిచేసేవారని, వీరిలో ఇద్దరు మహిళలు సైతం ఉన్నట్లు బిజాపుర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. శంబటి మద్కం (23), జ్యోతి పునెం (27) మహేశ్ తేలంపై ఒక్కొక్కరి తలపై రూ. 8లక్షల చొప్పున రివార్డు ఉందన్నారు. శంబటి అనే మహిళ 2012 నుంచి ఉద్యమంలో చురుగ్గా ఉండేవారని, 2020లో సుక్మా జిల్లాలో, 2021లో బిజాపుర్‌లో భద్రతా సిబ్బందిపై జరిగిన భారీ దాడుల ఘటనల్లో ఆమె పాత్ర ఉందని తెలిపారు.

విష్ణు కర్తమ్ అలియాస్ మోను, జైదేవ్ పొడియంలపైనా రివార్డు ఉన్నట్లు వెల్లడించారు. మావోయిస్టు భావజాలం పట్ల నిరాశ, ఉద్యమ నేతల దౌర్జన్యాలను ఎత్తిచూపుతూ వారు లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. తమ ఎదుట లొంగిపోయిన వారికి రూ. 25వేలు చొప్పున సాయంతో పాటు ప్రభుత్వ పాలసీ ప్రకారం పునరావాసాన్ని కల్పిస్తామని ఎస్పీ వెల్లడించారు. బిజాపూర్ జిల్లాలో ఈ ఏడాదిలో ఇప్పటివరకు 170మంది సరెండర్ కాగా.. 346 మంది నక్సలైట్లు అరెస్టయినట్లు తెలిపారు.

# హైడ్రానా... మజాకా...


హైదరాబాద్: హైడ్రా తీసుకున్న చర్యలు, కాపాడిన భూముల వివరాలతో కూడిన నివేదిక ప్రభుత్వానికి చేరింది. గత రెండు నెలల నుంచి చెరువుల్లో, పార్కుల్లో, ప్రభుత్వ భూముల్లో చేపట్టిన కూల్చివేతలు, కాపాడిన భూముల వివరాలను ఆ నివేదికలో వివరించారు. ఆదివారంప్రభుత్వానికి హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ తన నివేదికను అందజేశారు. ఓఆర్‌ఆర్ పరిధిలోని 8 మునిసిపల్ కార్పొరేషన్‌లు, 20 మునిసిపాలిటీలు, 33 పంచాయతీల పరిధిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు 18 చోట్ల కూల్చివేతలు జరిపినట్లు కమిషనర్ వెల్లడించారు. జూన్ 27 నుంచి ఈనెల 24 వరకు చేపట్టిన కూల్చివేతలకు సంబంధించిన వివరాలను నివేదికలో పొందుపరిచారు. కూల్చివేతలు చేపట్టిన 18 ప్రాంతాల్లోని కబ్జాల నుంచి 43.94 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆ నివేదికలో తెలిపారు.

**అందరూ ప్రముఖులే, ఆక్రమ నిర్మాణాలే..**

హైడ్రా తీసుకున్న చర్యల్లో ముఖ్యంగా చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లతో పాటు పార్కు స్థలాలను కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలు ఉన్నాయని, ఇందులో పలువురు రాజకీయ నేతలు, సినీనటులు, క్రీడాకారులు కూడా ఉన్నట్టు హైడ్రా నివేదికలో పేర్కొన్నారు. ఎన్ఓసిలు లేవు. అనుమతులు అంతకన్నా లేవు. కోర్టు కేసులు, క్రమబద్ధీకరణ లేకుండానే చెరువులను ఆక్రమించుకోవడం, నిర్మాణాలను చేపట్టడం ఈ చర్యలతో బహిర్గతమైనట్టు తెలిపినట్టు సమాచారం. వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని, సమగ్రంగా విచారణ చేపట్టిన అనంతరం చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన సందర్భంలో తెలియజేసినట్టు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. కొందరు కేసులని, అనుమతులు ఉన్నాయని, ఎన్ఓసిలు తీసుకున్నామని చెబుతూ వ్యవస్థలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నట్టు రంగనాథ్ తెలిపారనేది సమాచారం.

**కూల్చివేతలు, కాపాడిన భూములు..**

చింతల్ చెరువులో బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన స్థానిక నాయకుడు రత్నాకరం సాయిరాజు అక్రమంగా నిర్మించిన 54 నిర్మాణాలను నేలమట్టం చేసి 3 ఎకరాల 5 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు



ఆ నివేదికలో పొందుపరిచారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్ పార్కు స్థలంలో ఎంఎల్ఏ నాగేందర్ మద్దతుదారుడు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించి 18 గుంటల భూమిని కాపాడినట్టు వెల్లడించారు. ఎంఐఎం పార్టీకి చెందిన బహదూర్‌పురా ఎంఎల్ఏ మహ్మద్ ముబిన్, ఎంఎల్‌సి మిరాజ్ రెహ్మత్ బేగ్‌కు చెందిన రాజేంద్రనగర్ పరిధిలోని శివరాంపల్లి బూమ్‌రుఖ్ ఉద్ దౌలా చెరువులో అక్రమంగా నిర్మించిన ఐదంతస్థుల రెండు భవనాలను, ఒకటి రెండంతస్థుల భవనంతో పాటు మరో భవనాన్ని నేలమట్టం చేసినట్టు రంగనాథ్ తన నివేదికలో వివరించారు. ఈ చెరువు పరిధిలో మొత్తం 46 అక్రమ కట్టడాలను తొలగించడం ద్వారా 12 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనంలోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు.

గండిపేట్ జలాశయం ఎఫ్‌టిఎల్ పరిధిలోని చిలుకూరు, ఖానాపూర్‌లలో కాంగ్రెస్‌కు చెందిన కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు సోదరుడు పల్లం ఆనంద్, కావేరి సీడ్స్ యజమాని జివి భాస్కర్‌రావు, మంథని అసెంబ్లీ ఎంఎల్‌ఏగా పోటీ చేసిన సునీల్ రెడ్డి, ప్రో కబడ్డీ యజమాని అనుపమ అధికారికంగా అనుమతులు తీసుకోకుండా నిర్మించిన 8 భవనాలు, 14 తాత్కాలిక షెడ్లు, 4 ప్రహరీలను కూల్చివేసినట్టు తెలిపారు. ఈ చర్యలతో ఖానాపూర్, చిల్కూరు ప్రాంతంలో గండిపేట్ జలాశయం ఎఫ్‌టిఎల్ పరిధిలోని 16 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు హైడ్రా నివేదికలో వివరించారు. మాదాపూర్ తమ్మిడికుంట చెరువులో అనుమతులు లేకుండా ఎఫ్‌టిఎల్ పరిధిలో సినీనటుడు నాగార్జున అక్రమంగా నిర్మించిన ఎన్‌కన్వెన్షన్‌లో రెండు నిర్మాణాలను కూల్చివేసి 4 ఎకరాల 9 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీకి చెందిన ప్రదేశంలోని పార్కు స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని తొలగించి 16 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మన్సురాబాద్‌లో 2 గుంటలు, ఎంపి, ఎంఎల్ఏల కాలనీలో 6 గుంటలు, బంజారాహిల్స్ మిథిలానగర్‌లో ఎకరం 4 గుంటలు, ఫిల్మ్‌నగర్‌లోని బిజెఆర్ నగర్‌లో నాలాపై అక్రమంగా నిర్మించిన స్లాబ్‌ను కూల్చేసి 5 ఎకరాలు, గాజులరామారం మహదేవపురం వద్ద ఒక గుంట, గాజుల రామారం భూదేవిహిల్స్‌లో ఎకరం ఒక గుంట, అమీర్‌పేట్‌లో గుంట, చందానగర్ ఈర్ల చెరువులో అక్రమంగా నిర్మిస్తున్న మూడంతస్థుల భవనం ఒకటి, నాలుగు అంతస్థుల భవనాలు రెండు కూల్చేసి 16 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తన నివేదికలో తెలిపారు. బాచుపల్లి ఎర్రకుంటలో 29 గుంటలు, బోడుప్పల్ రెవెన్యూ భూమిలో 3 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు ఆ నివేదికలో వివరించారు.

## సంపాదకీయం

మంగళవారం, ఆగస్టు 27, 2024

# తంగలాన్ మూడు తరాల నెత్తుటి చరిత్ర

చరిత్ర అంటే ఘటనల సమాహారం. ఆ చరిత్రకు విజేతల విహారం తప్ప పరాజితుల గోస అసలే పట్టదు. ఎక్కడో ఒకే ఒకడు ఉంటాడు బాధ్యతగా, వ్యవస్థీకృతంగా అణచివేసిన అనామకుల గురించి తలచేవాడు.పా. రంజిత్ లాగా, తంగలాన్ లాగా తమ చుట్టూ నైరాశ్యం నిండి ఉన్నప్పుడు వెలుగు దివ్వెల గురించి ఆలోచిస్తూ తలపోతలతో అనామకంగా చరిత్ర కాలగర్భంలో కలిసిపోయిన చరిత్రను వెలికితీస్తుంటారు.వెతికే దృష్టికోణం, ఓపిక ఉండాలే కానీ మన పూర్వీకుల పాదముద్రలు కూడా చెక్కుచెదరకుండా పదిలంగా ఉంటాయి. ప్రకృతి మనకిచ్చిన గొప్ప వరం అది. పదిలంగా ఉన్న ఆ పాదముద్రలను మనమే చెరిపేస్తాం. ఇప్పుడు వెతికితే దొరికేవి తెగిన తలలు, తుప్పుపట్టిన కత్తులు అంతే. నాగరిక ఆవాస ఆనవాళ్లను తుదమట్టంగా చెరిపేసు కున్నాక గతం గురించి వలపోత ఎందుకు? ఒకప్పుడు ఇక్కడ మనిషి మహోన్నతంగా బతికాడు అనడానికి మిగిలిన మట్టి పెంకులు, శిలాజాలు, ఈటె, బల్లెం, వాడేసిన స్నాన ఘట్టం, ఆ నగర నిర్మాణానికి కూలిన బతుకులు, అధికారం కోసం తెగిన పీకలు. ఆ ధ్వంసం అయిన శిథిలాలలో గతాన్ని వెతుక్కుని ఏం లాభం. ద్వాపరలో చనిపోయిన శ్రీకృష్ణుడు పుట్టిన మూలాల గురించి కార్బన్ డేటింగ్ చేస్తాము గానీ ఈ దేశ విముక్తి కోసం రక్తతర్పణ చేసిన రాంజీ గోండ్, బిర్సా ముండా పేరే తలవం. గడిచిన కాలాన ఒక జాతి మీద మరొక జాతి, ఒక వ్యవస్థ మీద మరొక వ్యవస్థ తమ ఆధిపత్యం కోసమో, తమ జాతి ఉత్కృష్టతను కాపాడుకోవడానికో జరిపిన అమానవీయమైన మారణ హోమాలకు ఏదో ఒకదశలో నేలకు తలవంచి క్షమాపణ చెప్పాయి. తమ పాపాలను క్షమించమని వినమ్రంగా ప్రాధేయపడ్డాయి. కానీ ఏకలవ్యుడు, శంభూకుని మొదలు కంచక చర్ల కోటేశు, మంథని మధుకర్ దాకా నడిచి వచ్చిన నెత్తుటి గాయాలకు క్షమాపణ ఇంకా బాకీనే ఉంది. ఆ బాకీ తీర్చమని అడగాల్సిన అవసరం ఉంది. ఆ బాకీ తీర్చడంలో భాగంగానే పా.రంజిత్ తంగలాన్ సినిమా తీసాడు. అది మూడు గంటల సినిమా కాదు... మూడు తరాల నెత్తుటి చరిత్ర. పా రంజిత్ తీసిన పూర్వ సినిమాలు ఒక ఎత్తు, తంగలాన్ ఒకెత్తు. కేజీఎఫ్ లాంటి సినిమా చూసాక తంగలాన్ అవసరమా అనుకోవచ్చు. అందుకే రంజిత్ తన ఆలోచనను మార్చుకుని కేజీఎఫ్ గని లోతుల్లోకి చరిత్రలో అనామకంగా మిగిలిపోయిన పేజీలలోకి వెళ్లాడు. కోలార్ గోల్డ్ వెతుకులాట ఇప్పటిది కాదు, రాజరికపు కాలం నుండి టిప్పు సుల్తాన్ దాకా సామ్రాజ్య వాదుల నుండి తంగలాన్ దాకా రక్తసిక్తమైన చరిత్ర. రెండు వందల యాభై ఏళ్ల చరిత్రను రెండున్నర గంటల్లో దృశ్యమానం చేయడమూ సాహసమే. ఇది కాలంలోకి ప్రయాణం లాంటిది. అలా వెళ్లే క్రమంలో పూర్వం గొప్పగా విలసిల్లిన నాగ జాతులు, తథాగతుని అడుగు జాడలు కనుగొన్నాడు. హైందవ సమాజం తెగనరికిన బౌద్ధ, జైన ఆనవాళ్లు కనుగొన్నాడు. మత వ్యాప్తికోసం శైవ వైష్ణవ తెగలు నరికిన తలల చరిత్ర చూసాడు. నిజానికి ఇది తెగిన బుద్ధుడి తల కోసం తలపోత కాదు. తన బౌద్ధిక ప్రాభవాల ప్రదర్శనా కాదు. మతం రాజేసిన మానవ హననం ఎంత బీభత్సంగా ఉంటాదో వెతికాడు రంజిత్. రంజిత్ సినిమా తీసాడా, చరిత్ర తిరగ రాసాడా? అనేది చూసే వాని దృష్టి కోణం మీద ఆధారపడి ఉంటది. సినిమా అంటే ఇలానే ఉండాలి అని అలవాటు పడ్డ తెలుగు తెరకు మట్టి వాసన అద్దిన వాడు రంజిత్. తాతలు నేతులు తాగారు అని చెప్పే కాకమ్మ కథల స్థానే తెగిపడి శంబూకుని శిరస్సు చెప్పిన రహస్యాలను తవ్వి తీస్తున్నాడు. పెట్టుడు మీసాలు, పిట్టగూడు లాంటి విగ్గుకు అలవాటు పడ్డ బాబుల డాబుల దర్పాలు కాదు. వంటి చేత్తో వందల మందిని హతం చేయడం కాదు. చేతి కర్రను ఆయుధంగా మర్మకళను, రస విద్యనూ, సిద్ద వైద్యాన్ని, సిద్దుల జ్ఞానాన్ని వొడిసిపట్టాడు. మొత్తంగా చరిత్ర కాలగర్భంలో కలిసిపోయిన కక్కడి వారసుల ప్రతిరూపమే ఇవ్వాల్టి తంగలాన్. ప్రకృతి మనకు ఒనకూర్చిన వనరుల మీద ఆధిపత్యం కోసం ఒకనాటి రాజరిక, తర్వాత మధ్యయుగ కొనసాగింపుగా వచ్చిన ఆధునిక సమాజాలు రాజేసిన యుద్ధాల వెనక అన్యాక్రాంతం అయిన మూలవాసుల ఆర్తనాదం ఈ తంగలాన్. తంగలాన్ కేవలం ఒక గని కార్మికుడి చరిత్ర మాత్రమే కాదు. ఆ కోట్ల టన్నుల మట్టిని ఎత్తిపోసిన లక్షలాది కార్మికుల అనామకుల చరిత్ర. వాళ్లు ఏనాడూ ఏ ఆధిపత్య చరిత్రలో అయినా ఒక పేజీకి నోచుకోలేదు. ఆ విస్మృత చరిత్రను వెండితెర మీద దీప్య వెలుగులో దృశ్యమానం చేసాడు రంజిత్. ఈ సినిమాలో మత వ్యాప్తి ఉంది, మత మార్పిడి ఉంది, భూమిని స్వాధీనంలో ఉంచుకుని తరాలుగా వెట్టి చాకిరీ చేయించుకున్న రాజరిక, మధ్యయుగాల దాష్టీకం మీద తిరుగుబాటు ఉంది. చావుని ఎదిరించిన వాళ్లకు మాత్రమే ఇక్కడ జీవితం. చావుని ఎదిరించి బతికినా, పోరాడినా, చనిపోయినా నీ ఉనికిని నిరాకరించే ఉదంతాలు ఎన్నో.. వంద తలలు, కవచ కుండలాలు, మట్టి కుండల్లో జీవం పోసుకున్న మహిమాన్వితుల జీవిత కల్పనాజగత్తుకు అలవాటు పడ్డ లోకానికి కల్చరల్ షాక్ ఈ సినిమా.

# రోడ్లేమో ఇలా......

# ప్రయాణం సాగేది ఎలా ......?

## – ప్రధాన రోడ్లే ప్రమాదంగా మారిన వైనం.......

## – కనీస మరమత్తులు నోచుకోని రహదారులు....

## – చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు....?

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** చినుకు పడితే చాలు ప్రధాన రహదారులన్నీ చిత్తడి అవుతున్నాయి. ప్రధాన రహదారులు పట్టించుకోక పోగా అంతర్గత రోడ్లు అద్వాన్నంగా తయారయ్యాయి.అటు అధికారులు కానీ ఇటు పాలకులు గాని పట్టించుకున్న దాఖలాలు కనబడటం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో రోడ్డు చూసిన ఏమున్నది గర్వకారణమనట్లు పరిస్థితి తయారయింది. ప్రధాన రహదారులు సైతం పెద్ద పెద్ద గుంతలు పడి చిరు జల్లులకే చెరువులను తలపించే విధంగా తయారవుతున్నాయి రోడ్డుపై వాహనాలు వెళితే అదుపుతప్పి కింద పడే ప్రమాదంగా తయారయ్యాయి. గోపాల్ రావు పేట నుండి కరీంనగర్ వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారై తలాబులను తలపిస్తుండగా గోపాల్ రావు పేట నుంచి బూరుగుపల్లికి వెళ్లి రహదారి ఇంకా అద్వానంగా తయారై నరక ప్రయంగా మారింది. గ్రామాల్లో అంతర్గత రోడ్ల పరిస్థితి మాత్రం పట్టించుకునే నాధుడు కరువయ్యారు. అడుగు తీసి అడుగు పెట్టలేని పరిస్థితి తయారయ్యిందని పల్లెల్లో ప్రజలు పాలకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని 23 గ్రామాల్లో దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నట్లు కనపడుతున్నది. అంతేకాకుండా గ్రామాలలో ప్రత్యేక






పాటగా మారింద మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారులు పై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు ప్రజలకుతీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్న సంబంధిత అధికార గణం అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని ప్రజలు ఆగ్రహాన్ని వెలగక్కుతున్నారు.రోడ్లు ఎట్లుంటే మాకు ఏమి అన్నట్లు అధికారుల తీరు ఉండడంతో మండల ప్రజలు గుర్రుగా ఉ న్నారు. అసలు ప్రజా అసలు ప్రభుత్వం ఉందా అనే రీతిలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు తో జనాలు తలలు పట్టుకుంటున్నారు.ప్రధానంగా గోపాల్ రావు పేట బస్టాండ్ నుంచి బూరుగుపల్లి వెళ్లే ప్రధాన రహదారి చిన్న జల్లులకి జలమయం కావడంతో ప్రయాణం నరకప్రేయంగా మారుతుంది దీనిపై ప్రజలు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసిన కనీసం పట్టించుకునే కరువయ్యాడనే విమర్శలు వెలివెత్తుతున్నాయి.అసలు జీవితంలో ఈ రోడ్లు బాగు చేసే పరిస్థితి కనబడుతుంది అనే రీతిలో జనాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలో లోని రహదారులపై వేలాది వాహనాలు తిరుగుతుండగా ఈ గుంతలు పడి అందులో నీళ్లు నిలిచి ఉండగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు నిద్రమత్తు మాని రోడ్ల దుస్థితిపై చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రస్తుతం ప్రజాప్రతినిధులు అందరు మాజీలు కావడంతో అధికారులకు ఆడింది ఆట పాడింది

# ఓటమి ఎరుగని నాయకురాలు

ఆమె ముఖ్యమంత్రి. దేశంలో ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన ద్వితీయ మహిళ. ఐదున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఓటమి ఎరుగని ప్రజా విశ్వాసాన్ని చూరగొన్న నాయకురాలు. భారత దేశాన్ని అప్రతి హతంగా కొంతకాలం ఏలిన దేశ తొలి తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీకి అత్యంత సన్నిహితురాలు, విశ్వస నీయురాలు. ఆమెనే ఐరన్ లేడీ ఆఫ్ ఒడిశాగా పేరెన్నిక గన్న నందిని సత్పతి. నందిని సత్పతీ (1931 జూన్ 9 ం 2006 ఆగస్టు 4), జూన్ 1972 నుంచి డిసెంబరు 1976 వరకు ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేశారు. 1931 జూన్ 9న ఆమె జన్మించారు. ఆమె తండ్రి పద్మభూషణ్ కలాండి చరణ్ పాణిగ్రాహి ఒడిశాకు చెందిన సుప్రసిద్ధ వ్యక్తి. ఆమె తాత స్వనేశ్వర్ పాణిగ్రాహి గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. ఆమె మామ భగవతి చరణ్ పాణిగ్రాహి ఒడిశాలో కమ్యూనిస్ట్ పార్టీ స్థాపకులు. ఆమె రెండుసార్లు ధెంకనల్ నుండి ఎంపీగా ఎన్నికయ్యారు. 1972 లో, సార్వత్రిక ఎన్నికల్లో నలుగురు మాజీ ముఖ్య మంత్రులతో ఆమె ఒంటరి పోరాటం చేసి విజయం సాధించారు. రావెన్షా కళాశాలలో ఒడియాలో ఆర్ట్స్ లో మాస్టర్స్ డిగ్రీ చదివేటప్పుడు, ఆమె కమ్యూనిస్ట్ పార్టీ విద్యార్థి శాఖ అయిన స్టూడెంట్ ఫెడరేషన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. 1951లో కళాశాల విద్యకు రుసుములు పెరిగిన నేపథ్యంలో ఒడిశాలో విద్యార్థులు నిరసన ఉద్యమం ప్రారంభించారు. ఆ తరువాత అది దేశవ్యాప్త ఉద్యమంగా రూపుదాల్చింది. ఆ ఉ ద్యమానికి నందిని నాయకత్వం వహించారు. ఆ సమయంలో ఆమెపై లాఠీ చార్జి కూడా జరిగింది. మిగిలిన ఆందోళన కారులతో పాటు నందినిని కూడా జైలులో పెట్టారు. అక్కడే మరో విద్యార్థి నాయకుడు దేవేంద్ర సత్పతీని కలిశారు ఆమె. తరువాత వారిద్దరూ వివాహం చేసుకున్నారు. దేవేంద్ర ధేస్యనల్ నియోజకవర్గం నుంచి లోక్ సభకు ఎంపిగా రెండు సార్లు ఎన్నికయ్యారు. నందిని సత్పతి 1962 లో రాజ్యసభలో ప్రవేశించారు. ఇందిరా గాంధీ ప్రధాని అయిన తరువాత, నందిని సత్పతిని తన మంత్రివర్గంలో సమాచార, ప్రసార ఉప మంత్రిగా, తదుపరి మంత్రిగా నియమించు కున్నారు. నందిని సత్పతిని ప్రధానమంత్రి ఇందిరా గాంధీ రాజకీయములో కుడి భుజంగా భావించే వారు. బిజు పట్నాయక్ మరికొంత మంది కాంగ్రెస్ పార్టీ నుండి నిష్క్రమించిన కారణంగా 1972 లో నందిని సత్పత్తి ఒడిశాకు తిరిగి వచ్చి, ముఖ్యమంత్రి (జూన్ 1972 నుండి 1976 డిసెంబర్వ) అయ్యారు. అలా ఒడిశా








మొదటి మహిళా ముఖ్యమంత్రిగా ఉన్నారు. భారత దేశంలో ముఖ్యమంత్రి అయిన రెండవ మహిళగా చరిత్రలో నిలిచారు. ఆమె వ్యక్తిత్వంలో ఫైర్ బ్రాండ్ నాయకత్వాన్ని గుర్తించిన ఇందిరా గాంధీ ఆశీస్సులతో నందిని ముఖ్యమంత్రిగా తొలి సారిగా జూన్ 14, 1972 లో బాధ్యతలు స్వీకరించారు. భారత దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు ఆమె పదవీకాలం ఒక సంవత్సరంలో ముగిసింది. మార్చి 6, 1973 నుండి డిసెంబర్ 16, 1976 వరకు ఆమె రెండవసారి తిరిగి ఎన్నికయ్యారు. నందిని సత్పత్తిని 'ఐరన్ లేడీ ఆఫ్ ఒడిశా' అని 1998 పిలిచేవారు. నందిని సత్పతి రాజకీయాలలోనే లోనే గాక ఒక రచయితగా గుర్తింపు పొందారు. ఆమె తస్లిమా నస్రీన్ నవల లజ్జాను ఒడియాలోకి అనువదించారు. అది చేసిన ప్రధాన సాహిత్య రచన. నందిని సాహిత్య రచనలు ఇతర భాషల లోనికి అనువదించబడి ప్రచురించ బడ్డాయి. సాహిత్యానికి ఆమె చేసిన కృషికి, 1998లో సాహిత్య భారతి సమ్మన్ అవార్డును అందుకుంది. ఆమె ముఖ్య మంత్రిగా పని చేసినప్పుడు ఓడియా జాతీయ అత్యవసర పరిస్థితి ఆమె రాజకీయ జీవితంలో కష్టతరమైన సవాలు. కొందరు రాజకీయ నాయకులను అరెస్టు చేయడంతో ఆమె విమర్శలు ఎదుర్కొన్నారు. అల్లకల్లోల సమయంలో ఆమె చేసిన మితిమీరిన చర్యలకు ఆమె ఎప్పుడూ మద్దతు ఇవ్వలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆమె చేసిన పనితీరు దాదాపు ప్రతి రంగంలోనూ వృద్ధిని సాధించింది. ముఖ్యంగా, మహిళల సాధికారత, గ్రామీణ వృద్ధి, కళ, సంస్కృతి, విద్య వంటి రంగాలలో, ఆమె విశేషమైన చర్యలు తీసుకున్నారు. కార్యక్రమాలు నేటి వరకు ప్రజల జ్ఞాపకాలలో మరవలేనిది రాజకీయ పరిశీకులు పేర్కొంటారు. రైతులు లేదా వ్యవసాయ దారులు కాని భూములను తమ ఆధీనంలో ఉంచిన కొద్దిమంది వ్యక్తుల చేతుల నుండి భూములను విడిపించే ప్రత్యేకమైన భూ సంస్కరణలు చట్టాన్ని తీసుకురావడం ఒక చరిత్రగా ఒడిశా రాష్ట్ర ప్రజలలో మిగిలి పోతుంది. నందిని సత్పతి 2006 ఆగస్టు 04 న భువనేశ్వర్ లోని తన నివాసంలో అనారోగ్యంతో మరణించారు.



# ఐదేళ్ల తర్వాత అందాల విందు...


నేచురల్ స్టార్ నాని పైసా సినిమా హీరోయిన్ గుర్తుందా? అదేనండీ సిద్ధికా శర్మ. ఆ మూవీలో అందం, అభినయంతో అలరించిన ముద్దుగుమ్మ.. అనుకున్నంత స్థాయిలో అవకాశాలు అందుకోలేకపోయింది. తెలుగు సినిమాలకు దూరంగా ఉన్నా.. సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గా ఉంటోంది అమ్మడు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంటోంది. రకరకాల ఫోటో షూట్స్ పోస్ట్ చేస్తూ అలరిస్తుంటోంది. తన అందాలతో కుర్రకారు హృదయాలను దోచుకుంటూ ఉంటోంది. అలా తన ఫాలోవర్స్ ను పెంచుకుంటూ ఉంటోంది. గ్లామర్ డోస్ పెంచేసి ఫిదా చేస్తుంటోంది. తాజాగా సిద్ధికా శర్మ నయా పిక్స్ ను తన ఫ్యాన్స్ కోసం షేర్ చేసింది. వైట్ ప్యాంట్ అండ్ బ్లూ కలర్ జాకెట్ వేసుకున్న అమ్మడు ఓ రేంజ్ లో ఉంది. హీట్ పుట్టించే అందాలతో ఒక్కసారిగా సెగలు పుట్టించింది. హెయిర్ లీవ్ చేసుకుని తన లుక్ తో ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం అమ్మడు ఫోటో నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. పిక్ అదిరిపోయిందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. లైకుల వర్షం కురిపిస్తూ కామెంట్ సెక్షన్ నింపేస్తున్నారు. సో బ్యూటిఫుల్ అంటూ కొనియాడుతున్నారు.





# వీరాభిమానికి చిరంజీవి సత్కారం..

తిరుపతి జిల్లాకి చెందిన చిరంజీవి వీరాభిమాని ఈశ్వరయ్య.. ఆగస్టు 22న మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మెట్ల మార్గంలో పొర్లుదండాలు పెట్టుకుంటూ తిరుమల కొండ ఎక్కి తన అభిమానాన్ని చాటుకున్నాడు. చిరంజీవి, ఆయన కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని తిరుమల తిరుమల వెంటేశ్వరస్వామిని ప్రార్థించారు. కాగా, ఈశ్వరయ్య గురించి తెలుసుకున్న చిరంజీవి...హైదరాబాద్‌లోని తన ఇంటికి ప్రత్యేకంగా ఆహ్వానించి మాట్లాడారు. ఈశ్వరయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యులను పట్టువస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య కుటుంబానికి అండగా ఉంటానని మెగాస్టార్ హామీ ఇచ్చారు.



# స్పిరిట్ కు ముహూర్తం ఫిక్స్..!



'కల్కి 2898ఏడీ'తో బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టేశాడు ప్రభాస్. ఓటీటీలో కూడా 'కల్కి' చేస్తున్న హంగామా మామూలుగా లేదు. త్వరలో ప్రభాస్ నుంచి మరిన్ని అద్భుతాలు రానున్నాయి. వాటిల్లో ఒకటి 'స్పిరిట్'. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించనున్న ఈ సినిమా విషయంలో ఓ తాజా అప్‌డేట్ వెలుగు చూసింది. 'స్పిరిట్' షూటింగ్‌ని వచ్చే ఏడాది జనవరి నుంచి మొదలుపెట్టనున్నారట సందీప్‌రెడ్డి. ఈ లోపు ప్రభాస్ తన ఇతర ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటారు. పాన్ ఆసియా లెవల్లో తెరకెక్కనున్న 'స్పిరిట్' షూటింగ్‌ని నిరవధికంగా ఏడాది పాటు ప్లాన్ చేశారట సందీప్‌రెడ్డి. 2026 జనవరిలో సినిమాను విడుదల చేసేందుకు ఆయన కసరత్తులు చేస్తున్నాడు. . ఇందులో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో నటించనున్నారు. త్రిష కథానాయికగా ఎంపికైనట్టు వార్తలు వస్తున్నాయి. మొత్తానికి సందీప్ సాలిడ్ ప్లానింగ్‌తోనే ఉన్నాడని చెప్పొచ్చు.

# దేవకన్యలా... ప్రియా వారియర్

ప్రియా ప్రకాష్ వారియర్.. సోషల్ మీడియాలో ఎంతగా క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'ఒరు ఆధార్ లవ్' అనే చిన్న మలయాళ చిత్రం నుండి సోషల్ మీడియాలో స్టార్ అయిపోయిన ఈ బ్యూటీకి అప్పటి నుండి మంచి క్రేజ్ అందుతోంది. ఓ సింపుల్ వింక్ తో కుర్రకారుని ఆకట్టుకుని ఒక్క స్మైల్‌తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రియా, ఇప్పటివరకు అదే క్యూట్ అండ్ గ్లామర్ లుక్‌ని కొనసాగిస్తూ ట్రెండింగ్ లో ఉంది. అదే కోవలో భాగంగా, ప్రియా పలు సినిమాల్లో నటించినప్పటికీ, ఫోటోషూట్ లతో కనిపించే గ్లామర్ కే ఎక్కువగా క్రేజ్ అందుతోంది. లేటెస్ట్ గా ఆమె ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసిన ఫోటో సైతం నెట్టింట్లో వైరల్ గా మారింది. ఈ గ్రీన్ కలర్ లెహంగా-చోళి డ్రెస్ లో ఆమె ఇచ్చిన స్టిల్ సూపర్బ్ అనేలా ఉంది. ఆ లుక్‌లో ప్రియా ప్రకాష్ వారియర్ ఒక విధంగా స్వర్గం నుండి దిగిన దేవతలా కనిపిస్తోందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ఆమె ఇచ్చిన పొజెస్ కళ్లను కట్టిపడేస్తున్నాయి. పూర్తిగా కళాత్మకంగా అద్భుతమైన విజువల్స్ తో ఆమె ఫోటో స్టైలింగ్ ప్రత్యేక గుర్తింపుని తెచ్చాయి. ఈ ఫోటోకి కేవలం కొన్ని గంటల్లోనే లక్షలలో లైకులు వేలల్లో కామెంట్స్ వచ్చాయి. సోషల్ మీడియా వేదికగా తన గ్లామర్ , ఫ్యాషన్ స్టైల్ తో అభిమానులను అలరిస్తూనే ఉంది. ఫ్యాషన్ స్టేట్‌మెంట్ తో పాటు, ఫోటోషూట్స్ లో కూడా ఆమె తన ప్రత్యేకతను చాటుకుంటోంది.



